

శేషవాహనంపై నీలకంఠుడు

చెర్వుగట్టులో సోమవారం తెల్లవారు జామున స్వామివారిని శేషవాహనంపై ఊరేగించారు. - 10లో



సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

సిమెంట్ పరిశ్రమలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31°/18°

ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రిపూట చలి మోస్తారుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న టీచర్ల దరఖాస్తుల ప్రక్రియ

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయులు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 28 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ సోమవారంతో ముగియనుండగా ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పెంచింది. దీంతో ఉపాధ్యాయులకు కొంత ఉపశమనం లభించింది. ఇప్పటి వరకు ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్‌లు, జీహెచ్ ఎంలు బదిలీల కోసం 2,289 మంది ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్నారు. రెండు రోజులు గడువు ఉండటంతో మరికొంత మంది దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉంది. అలాగే స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీలకు సంబంధించి ప్రమోషన్‌ల కోసం చేసుకున్న దరఖాస్తుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయింది.

తిరుమలగిరి మార్కెట్‌లో వేరుశనగ క్వింటా రూ.8,639



తిరుమలగిరి మార్కెట్‌లో వేరుశనగ

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగ క్వింటాకు రూ.8639 ధర పలికి రికార్డు సృష్టించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. సోమవారం మార్కెట్‌కు 293 బస్తాల వేరుశనగ కాయ రాగా గరిష్ఠంగా క్వింటాకు రూ.8639, కనిష్ఠంగా రూ.5800 ధర పలికినట్లు వివరించారు. ఇప్పటి వరకు క్వింటాకు రూ.8,639 ధర పలకడం ఇదే ప్రథమమని చెప్పారు.

డాక్టర్ సతీష్‌కు వైద్య సేవా రత్నం అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సతీష్

సూర్యాపేట : జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ ఫిజియోథెరపిస్టు డాక్టర్ సతీష్‌కు వైద్య సేవా రత్నం అవార్డు లభించింది. అనారోగ్యానికి గురైన ఎంతో మందితో పాటు వికలాంగులకు పది సంవత్సరాలుగా తన ఫిజియోథెరపీ సేవలతో ఆరోగ్యవంతులుగా చేసినందుకు హైదరాబాద్‌కు చెందిన ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, స్టేట్ ఫిజియో థెరపీ వెల్ఫేర్ అసోసియేషన్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి సికింద్రాబాద్ పారడైజ్ సర్కిల్ లో కిమ్స్, సన్షైన్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల మాజీ చైర్మన్ జస్టిస్ జి. చంద్రయ్య, హైకోర్టు జడ్జి ఎ. రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వారితో పాటు మందడి కృష్ణారెడ్డి, గురువారెడ్డి, ఆవులప్ప, అంబదాస్, చిట్టిబాబు, కిశోర్‌కుమార్, సూర్యనారాయణ, అమితా మురళీధర్, యమున, సురేఖ మీనాక్షి తదితరులు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. వైద్య రత్న అవార్డు రావడం పట్ల పలువురు డాక్టర్స్, మిత్రులు, బంధువులు ఆయనను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

'మన ఊరు మన బడి' పనుల్లో వేగం పెంచాలి



అంత్యాతండా ప్రాథమిక పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న డీఈఓ అశోక్

మఠంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మనఊరు–మనబడి పనుల్లో వేగం పెంచాలని డీఈఓ అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం మఠంపల్లి మండలం అంత్యాతండా, అల్లీపురం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. అలాగే మనఊరు–మనబడి పథకం కింద పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ చత్రునాయక్, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ఎస్‌కె.మస్తాన్, ఉపేందర్, ఉపాధ్యాయులు సైదులు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



8లో

విద్యతో పాటు క్రీడలు అవసరం

విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ వారు రీజినల్ స్పాన్సర్స్‌గా మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. విజేత జట్లకు ట్రోఫీలు అంజేశారు. – సూర్యాపేట టౌన్

సీనియర్స్ విభాగంలో విజేత ముకుందాపురం శాంతినికేతన్ డిగ్రీ కళాశాల జట్టుకు మొదటి బహుమతి అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

వంద శాతం లక్ష్యంగా..

మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- సిబ్బందికి రోజువారీ టార్గెట్లు
- నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు
- ఇప్పటి వరకు రూ.3030.41లక్షలకు రూ.1480.26లక్షలు వసూలు
- ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 60 రోజుల సమయం



తిరుమలగిరిలో ఆస్తి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి): మున్సిపాలిటీల్లో అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు నెలలు గడువు ఉంది. దీంతో సిబ్బందికి టార్గెట్లు విధించి పన్నుల వసూళ్ల ప్రక్రియ ముమ్మరం చేశారు. ఎలాగైనా వందశాతం లక్ష్యం చేరుకోవాలన్న తలంపుతో ముందుకుసాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీల్లో రూ.3030.41లక్షల పన్నులు వసూలు చేయాలన్నది టార్గెట్ కాగా ఇప్పటి వరకు రూ.1480.26లక్షలు వసూలయ్యాయి. వీటిలో అత్యధికంగా నేరేడుచర్ల లో 54.78 శాతం, అత్యల్పంగా హుజూర్‌నగర్‌లో 40.65 శాతం పన్నులు వసూలు చేశారు.

ఎలాగైనా వసూలు చేయాలని..

బకాయిలు కొండలా పేరుకుపోయిన నేపథ్యంలో ఎలాగైనా పన్నులు వసూలు చేసేందుకు వార్డుల వారీగా బిల్ కలెక్టర్లకు రోజూ వారీగా లక్ష్యాలు ఇచ్చారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే నోటీసులు జారీ చేసి హెచ్చరిస్తున్నారు. కొంత మంది ఇళ్లలోని నల్లాలను సైతం తొలగిస్తున్నారు. గతంలో బిల్ కలెక్టర్ల కొరత కారణంగా క్షేత్ర స్థాయిలో పన్నుల వసూళ్ల ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తేవి. ప్రస్తుతం వీఆర్‌ఓలను జూనియర్ అసిస్టెంట్లుగా తీసుకోవడంతో ఆ ఇబ్బందులు తొలగిపోయాయి. ఆన్‌లైన్, సిటిజన్ బడ్డీ, సీడీఎంఏ వెబ్‌సైట్, ఈ మున్సిపాలిటీ, మున్సిపాలిటీ వెబ్‌సైట్, క్యూఆర్ కోడ్, నేరుగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ మేళా, బిల్ కలెక్టర్‌ను సంప్రదించి పన్నులు కట్టే సౌకర్యాన్ని అధికారులు కల్పించారు.

మున్సిపాలిటీల్లో..

జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో 66,007 ఇళ్లు అసెస్‌మెంట్ అయ్యాయి. వీటి నుంచి మొత్తం రూ.3030.41లక్షల పన్నుల వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.1480.26లక్షలు వసూలయ్యాయి. వీటిలో సూర్యాపేటలో రూ.906.40లక్షలు, కోదాడలో రూ.332.08లక్షలు, హుజూర్‌నగర్‌లో రూ. 108.32లక్షలు, తిరుమలగిరిలో రూ. 76.94 లక్షలు, నేరేడుచర్ల మున్సిపాలిటీలో రూ. 56.52లక్షలు వసూలు చేశారు.

మున్సిపాలిటీల వారీగా పన్నుల వసూలు

మున్సిపాలిటీ	అసెస్‌మెంట్	డిమాండ్ రూ.లక్షల్లో	వసూళ్లు	శాతం
సూర్యాపేట	33304	1854.09	906.40	48.89
కోదాడ	16179	699.27	332.08	47.49
హుజూర్‌నగర్	7500	266.45	108.32	40.65
తిరుమలగిరి	5348	107.43	76.94	48.87
నేరేడుచర్ల	3676	103.17	56.52	54.78

వార్డుల వారీగా బిల్ కలెక్టర్‌ను నియమించాం



ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు చేసేందుకు వార్డుల వారీగా బిల్ కలెక్టర్‌ను నియమించాం. మార్చి 31 వరకు వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు కృషి చేస్తున్నాం. పాత బకాయిలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే 48 శాతం పన్నులు వసూలయ్యాయి.

– దండు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, తిరుమలగిరి

పది విద్యార్థులకు పరీక్షే..



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

- మొక్కుబడిగా ప్రత్యేక తరగతులు
- ఇప్పటికే అల్పాహారం అందించేవారు లేక ఇబ్బందులు
- మరోవైపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ
- పిల్లల అభ్యసనపై ప్రభావం చూపే అవకాశం
- రెండు నెలల్లో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు

సూర్యాపేటటౌన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్నాయి. అయితే ప్రభుత్వ బడుల్లో గత ఏడాది డిసెంబర్ మొదటి వారం నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అల్పాహారం లేక పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కుబడిగా తరగతులు నిర్వహిస్తున్నారు. మరో వైపు పరీక్షల వేళ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపడుతున్నారు. దీంతో పిల్లల అభ్యసనపై ప్రభావం చూపే అవకాశం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

జిల్లాలో 4,411 మంది పదో తరగతి విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పరిధిలో నడిచే అన్ని పాఠశాలలు 234, ప్రైవేట్ యాజమాన్యం పరిధిలో నిర్వహించే 164 పాఠశాలల్లో కలిపి మొత్తం 12,219 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో 234 జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 4,411 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు బడిలోనే ఉండి చదువుకుంటారు. ఆయా గ్రామాల పరిధిలో విద్యాకమిటీ చైర్మన్లు, ఎన్‌ఆర్‌ఐలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల వద్దకు వెళ్లి సహాయం చేయాలని హెచ్‌ఎంలు అడుగుతున్నా ఫలితం లేదు. ఇప్పటి వరకు ఎక్కడా కూడా దాతలు ముందుకొచ్చిన పరిస్థితి కనిపించడం లేదు. దీంతో అనేక పాఠశాలల్లో పది ఇరవై నిమిషాల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను ఇళ్లకు పంపించేస్తున్నారు. దాతలు ముందుకొస్తే గానీ వారికి అల్పాహారం అందించే వీలులేదు.

ఇబ్బందులు కలుగకుండా చూస్తాం



ఈ విద్యా సంవత్సరం చివరలో బదిలీలు, పదోన్నతులు చేపడుతున్నాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తాం. విద్యాబోధనలో, ప్రత్యేక తరగతుల విషయంలో లోపాలకు తావివ్వకుండా దృష్టి పెడతాం. ప్రస్తుతం బదిలీఅయినా పరీక్షలయ్యే వరకు ప్రస్తుత బడిలోనే పని చేయాల్సి ఉంటుంది.

– అశోక్, డీఈఓ

అత్యంత కీలకమైన సమయం..

ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఈ సమయం అత్యంత కీలకం. మెరుగైన బోధన అందించాలి. ఈ సమయంలో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడంతో సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి సెలవుల్లో ప్రక్రియ చేపడితే మేలని పలువురు సూచిస్తున్నారు. బదిలీలతో పదో తరగతి విద్యార్థుల బోధనపై ప్రభావం పడనుంది.

మహాత్ముడి ఆశయాలకు అనుగుణంగా నడవాలి

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు



కలెక్టరేట్‌లో మౌనం పాటిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ యస్. మోహన్‌రావు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి మహాత్ముడికి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అదరపు కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం త్యాగం చేసి పోరాడి అసువులు బాసిన ఎందరో మహానుభావుల పుణ్య ఫలంగా మనమీనాడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోగలుగుతున్నామని, వారి సేవలను స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహమనే ఆయుధాలతో అహింసా మార్గంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన యోధుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శ్రీదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ దరఖాస్తుదారులకు సమాధానం చెప్పాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు తగిన సమాధానం చెప్పాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి 22 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోడు భూముల పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తాం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పోడు భూముల పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి అధికారులతో కలిసి జిల్లా కంటి వెలుగు, మన ఊరు- మన బడి, పోడు భూములు, పామ్ ఆయిల్ సాగు, టీచర్‌ల బదిలీలు, జీఓ 58, 59 తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో జిల్లా నుంచి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కంటివెలుగు, మన ఊరు- మన బడి పనులను కూడా పకడ్బందీగా చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, కిషోర్ కుమార్, వెంకారెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, డీఎఫ్‌ఓ సతీష్, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారులు పాల్గొన్నారు.

మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు , వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణతంతును ముగించారు. ఆతర్వాత నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించారు. అంతేగాక క్షేత్రంలో కొలువైఉన్న శివాలయంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు , లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామా చార్యులు, చీకూరి రాజేష్ పాల్గొన్నారు.

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై ఉన్న శివాలయంలో సోమవారం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. హోమ మండపంలో తొలుత అగ్నిప్రతిష్ఠ చేసి రుద్రహవనం గావించారు. అనంతరం పూర్ణాహుతి, మహాశివుడికి అభిషేకం, అర్చనలు జరిపించారు. గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు చేసి హారతినిచ్చారు. సాయంత్రం శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి సేవను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు కొనసాగాయి. సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి



పస్తాలలో మందులను పంపిణీ చేస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావు

నాగారం : పాడి రైతులు తమ పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స చేయించాలని, పశువులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండల పరిధిలోని పస్తాల గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఎదకురాని 46 ఆవులను, గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించి, పాడిపశువులకు అందించే మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. అలాగే 41 దూడలకు నట్టల నివారణ మందును తాపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్యాల ఈశ్వరమ్మ, ఉపసర్పంచ్ చిత్తలూరి రమేష్, పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ బి.రవిప్రసాద్, మండల పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల రవి, డాక్టర్ రజిత, జేవీఓ నాగరాజు, ఎల్ఎస్ఏ మురళి, రైతులు మల్యాల అశోక్, నాతి శ్రీనివాస్, మల్లయ్య, లింగయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెలుగు 'చూస్తున్న' కంటి సమస్యలు

- శిబిరాల్లో రీడింగ్ అద్దాలు మాత్రమే పంపిణీ
- డయాబెటిక్ రెటినోపతి లక్షణాలు గుర్తించే యంత్రంలేక మధుమేహ వ్యాధిగ్రస్తులకు నిరాశే
- శస్త్రచికిత్సలపై స్పష్టత కరువు



నాగారంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాగారం : జిల్లాలో ఎక్కువ మంది కంటి సమస్యలతో బాధ పడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో ఈ విషయం వెల్లడవుతోంది. కంటి పరీక్షల్లో చాలా మందికి చూపు మందగించడం, కంటి శుక్లాల సమస్యలు వంటివి బయటపడుతున్నాయి. ఎనమిది రోజుల్లో జిల్లాలో 41,840 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో దాదాపు సగం మందికి కంటి సంబంధిత ఇబ్బందులున్నాయి. వైద్యులు నేత్ర సమస్యలను గుర్తించి అప్పటికప్పుడే అద్దాలు పంపిణీ చేస్తున్నారు. పని ఒత్తిడి, ఉద్యోగ భారం, సెల్‌ఫోన్ వినియోగం, కంప్యూటర్ల వినియోగం తదితర కారణాలే నేత్ర సమస్యలకు ప్రధాన కారణమవుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కాగా మధుమేహ వ్యాధిగ్రస్తులను పరీక్షించి రెటీనా, డయాబెటిక్ రెటినోపతి లక్షణాలను గుర్తించే యంత్రం లేకపోవడంతో చాలా మంది నిరాశగా వెనుదిరుగుతున్నారు.

పరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య	అద్దాలు పంపిణీ చేసింది
41,840	11,538

దూరపు చూపు లోపం ఉండి అద్దాలు అవసరమైన వారి సంఖ్య 7,171

సెల్‌ఫోన్ వాడకంతోనే అధికం..

ప్రస్తుతం సెల్‌ఫోన్ వినియోగం ప్రతి ఒక్కరికి పరిపాటిగా మారింది. తెల్లవారింది మొదలు రాత్రి పడుకునే వరకు సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరి వెంటే ఉంటోంది. ముఖ్యంగా యువత ఎప్పుడు చూసినా స్మార్ట్‌ఫోన్‌తోనే గడుపుతున్నారు. మరోవైపు కంప్యూటర్లు, ట్యాబ్‌ల వినియోగం పెరిగింది. వైద్య శిబిరాలకు వచ్చే వారిలో చాలా మందికి మొబైల్ ఫోన్, కంప్యూటర్ల ద్వారానే చూపు మందగిస్తున్నట్లు గుర్తిస్తున్నారు. ముఖ్యంగా ఉరుకుల పరుగుల జీవనం, ఉద్యోగ ప్రస్థానంలో ఒత్తిడికి గురవుతుండటంతో రక్తపోటు, మధుమేహం పెరుగుతోంది. ఇది రెటీనా, డయాబెటిక్ రెటినోపతి సమస్యలకు దారి తీస్తోంది.

కేవలం దగ్గరి చూపు లోపం ఉన్నవారికే..

కంటి వైద్య శిబిరాల్లో 18 ఏళ్లు నిండిన వారికి పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి వెంటనే రీడింగ్ అద్దాలు ఇచ్చేస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఎదురవుతున్న డయాబెటిక్ రెటినోపతి పరీక్ష చేయడం లేదు. ఏఆర్ యంత్రంలో ఈ సౌలభ్యం లేకపోవడంతో పరీక్షలకు వచ్చిన వారు నిరాశకు గురవుతున్నారు. కేవలం దగ్గరి చూపు లోపం ఉన్న వారికే అద్దాలు ఇస్తూ దూరం చూపు మందగించిన వారికి తర్వాత ఇస్తామంటూ పంపిస్తున్నారు.

41,840 మందికి పరీక్షలు..

కంటి వెలుగు పరీక్షలను 100 రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనిలో భాగంగా జిల్లాలో 616 వైద్యశిబిరాలు, 50 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది రోజుల్లో 41,840 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, వీరిలో 11,538 మందికి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే దూరపు చూపు లోపం ఉండి అద్దాలు అవసరమైన 7,171 మందిని గుర్తించి వారికి అద్దాలు పంపిణీ చేసేందుకు ఆర్డర్‌లు ఇచ్చారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారు కంటి వెలుగు శిబిరాలకు వెళితే వారికి పరీక్షలు చేస్తున్నారే తప్ప ఆపరేషన్లపై ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ప్రభుత్వం కంటి ఆపరేషన్లు చేయిస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 10 గ్రామపంచాయతీలు, 8 వార్డుల్లో కంటివైద్య శిబిరాలు పూర్తయ్యాయి. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్.హర్షవర్ధన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి, సూర్యాపేట.

క్లుప్తంగా

అదానీ షేర్ల పతనంతో సీపీఎస్ ఉద్యోగుల సొమ్ము ఆవిరి



మాట్లాడుతున్న నాగవెల్లి ఉపేందర్

నల్లగొండ టూటౌన్ : అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు పతనం కావడంతో దేశంలోని 84లక్షల సీపీఎస్ ఉద్యోగుల సొమ్ము ఆవిరైపోయిందని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అదానీ గ్రూప్‌కు ఎల్ఐసీ, ఎస్బీఐ ఇచ్చిన రుణాల్లో 67 శాతం డబ్బులు సీపీఎస్ ఉద్యోగులవేనని, కమీషన్లకు ఆశపడి కార్పొరేటర్లకు లాభం చేకూరేలా వ్యవహరించడంతో ఉద్యోగులకు తీరని నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోనే అదానీ గ్రూప్ కంపెనీలకు సంబంధించి స్టాక్ మార్కెట్‌లో రూ.4లక్షల కోట్లు ఆవిరయ్యాయని, అందులో ఎల్ఐసీ రూ.18 వేల కోట్లు, ఎస్బీఐవి రూ.54 వేల కోట్లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు, ప్రధాన కార్యదర్శి బొమ్మనబోయిన శ్రీనివాస్, కోశాధికారి విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ సింగ్, నల్లమేకల వెంకయ్య, పంకజ్‌రెడ్డి, కృష్ణ, ఫారూఖ్, ప్రవీణ్, చక్రపాణి పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్ ఢీకొని వృద్ధుడికి గాయాలు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

చిట్యాల: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కాన్వాయ్‌లోని ఓ వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలయ్యాయి. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మంచాల ఎల్లయ్య తన టీవీఎస్ ఎక్సెల్‌పై రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి వద్ద జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపునకు వెళ్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి కాన్వాయ్‌లోని చివరి వాహనం ఎల్లయ్య టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఘటన స్థలాన్ని నార్కట్‌పల్లి సీఐ శివరాంరెడ్డి, చిట్యాల ఎస్ఐ ధర్మ పరిశీలించారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ



సీనియర్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి



సుధాకర్ పీవీసీ డైరెక్టర్ డాక్టర్ మీలా సందీప్‌ను సన్మానిస్తున్న సాక్షి బ్రాంచి మేనేజర్ తదితరులు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ వారు రీజినల్ స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తున్న సాక్షి ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన సీనియర్స్, జూనియర్ విభాగంలో విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి సాక్షి మీడియా క్రీడాపోటీలు నిర్వహించడం గొప్ప నిర్ణయమన్నారు. యువత ప్రతినిత్యం తమకు నచ్చిన క్రీడలో సాధన చేయాలన్నారు. జిల్లా నుంచి దేశానికి ఆడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా హాజరైన సుధాకర్ పీవీసీ గ్రూప్ ఆఫ్ కంపెనీ డైరెక్టర్ డాక్టర్ మీలా సందీప్ విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప్పల ఆనంద్, జూలకంటి జీవన్‌రెడ్డి, సంజీవనాయక్, డాక్టర్ సుధీర్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ రుక్మాధర్, యాడ్స్ మేనేజర్ వెంకన్న, యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, సిబ్బంది యాకయ్య, జానయ్య, లింగారెడ్డి, ప్రసాద్, విజయ్, వేణు, నరేందర్, శ్రీనివాస్, మధు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ..

మూడు రోజుల పాటు జరిగిన సాక్షి ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగింది. ఉమ్మడి జిల్లా నుంచి వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ఉత్సాహంగా మ్యాచ్‌లు ఆడారు. చివరి రోజు సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, శాంతినికేతన్ డిగ్రీ కళాశాల ముకుందాపురం విద్యార్థుల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. రసవత్తరంగా జరిగిన ఈ పోటీలో శాంతినికేతన్ డిగ్రీ కళాశాల ముకుందాపురం టీం విజయం సాధించింది. అలాగే జూనియర్స్ విభాగంలో నాగార్జునసాగర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, మట్టపల్లి ఎన్‌సీఎల్ జూనియర్ కళాశాల విద్యార్థులు తలపడగా మట్టపల్లి ఎన్‌సీఎల్ జూనియర్ కళాశాల విద్యార్థులు గెలుపొందారు.

నిత్యం సాధన చేస్తా



సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో పాల్గొనడం సంతోషంగా ఉంది. అలాగే ఈ టోర్నీలో తాము కప్ గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నేను ప్రతినిత్యం సాధనచేస్తా.

– ముజాహిద్, ఆల్ రౌండర్

ఇదే ఉత్సాహంతో..



సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో ఉత్సాహంగా పాల్గొన్నా. ఈ టోర్నీలో ఆడినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇదే ఉత్సాహంతో మరిన్ని మ్యాచ్‌లో పాల్గొని సత్తా చాటుతా..

– ఫైజ్, క్రీడాకారుడు



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



జూనియర్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన సాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు



జూనియర్స్ విభాగంలో విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంటున్న మట్టపల్లి ఎన్‌సీఎల్ జట్టు





ఫైనల్‌లో తలపడుతున్న శాంతినికేతన్ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు

పోలీస్ గ్రీవెన్స్‌తో బాధితులకు భరోసా



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: పోలీస్ గ్రీవెన్స్ కార్యక్రమంతో బాధితులకు భరోసా కల్పిస్తున్నామని ఎస్పీ అపూర్వరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి బాధితులు అందించిన ఫిర్యాదులను ఆమె స్వీకరించి వారితో మాట్లాడారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా బాధితులకు న్యాయం చేస్తేనే పోలీసుల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు.

మహిళల రక్షణకే షీటీం పోలీసులు

మహిళలకు రక్షణగా షీ టీం పోలీసులు నిరంతరం పనిచేస్తున్నార ని ఎస్పీ అపూర్వరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్రంలోని 8 జిల్లాలకు చెందిన షీ టీం బృందాలకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు నిర్భయంగా క్యూఆర్ కోడ్ స్కానింగ్, వాట్సాప్, డైల్ 100 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. మహిళల భద్రతలో జిల్లా షీటీం బృందం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని, అందుకు కృషి చేసిన సీఐ రాజశేఖర్‌ను అభినందించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే షీ టీం నల్లగొండ 9963393970, మిర్యాలగూడ 86883 88489, దేవరకొండ 9705080942 కు ఫోన్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ప్రసాద్‌రావు, డీఎస్పీ శేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం



కోడి అర్జున్ (ఫైల్)



చిట్యాల: సైదులు మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట) : వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. చివ్వెంల, చిట్యాల మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన కోడి అర్జున్ (21) స్థానిక ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. అత్తవారి ఇంటి నుంచి వచ్చిన అర్జున్ సోదరి ఇంట్లో గదికి తలుపులకు గడియవేసి ఉండడంతో ఇరుగుపొరుగు వారిని పిలిచింది. వారు తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే అర్జున్ మృతిచెందాడు. మృతదేహాన్ని కిందకు దించి పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రేమ వ్యవహారమే అర్జున్ ఆత్మహత్యకు కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఏపూరులో ఖమ్మం వాసి..

చిట్యాల: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లచ్చయ్యతండాకు చెందిన భూక్యా సైదులు, తన భార్య పావని, ఇద్దరు పిల్లలతో కలిసి కొంతకాలంగా చిట్యాల మండలం ఏపూరు గ్రామంలో కూలి పనులు చేసుకుంటు ఉంటున్నారు. కాగా, ఆదివారం రాత్రి దంపతులు గొడవ పడ్డారు.అనంతరం సైదులు(30) భార్యను ఇంట్లోంచి నెట్టి వేసి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గుర్తించిన చుట్టు పక్కల వారు అతడిని ఆస్పత్రికి తరలించగా అపటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. సోమవారం మృతుడి సోదరుడు మంగిలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మా తెలిపారు.

అరెస్ట్‌కు నిరసనగా పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, గిరిజనులు

బొమ్మలరామారం : మండల పరిధిలోని గద్దరాళ్ల తండాలో దొంగలు అనుకుని పోలీసులపై దాడి చేసిన ఘటనలో సోమవారం ఎనిమిది మంది గిరిజనులు అరెస్ట్ చేశారు. దీనిని నిరసిస్తూ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి నాయకత్వంలో గిరిజనులు ధర్నా, రాస్తారోకో చేశారు. రాత్రి సమయంలో ఎలాంటి సమాచారం లేకుండా తండాకు వచ్చి అక్రమంగా అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించడంతోనే దొంగలుగా భావించి దాడులు జరిగాయని పేర్కొన్నారు. తెలియని తప్పుకు బాధ్యులు చేసి అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదంటూ రెండు గంటలకు పైగా ఆందోళన చేశారు. మఫ్టీలో ఉన్నా పోలీసులపై దాడులు నిర్వహించిన వారి పైనే కేసులు నమోదు చేశామని, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని భువనగిరి రూరల్ సీఐ వెంకటయ్య, ఎస్ఐ రాఘవేందర్ గౌడ్, స్థానిక ఎస్ఐ వెంకన్న, ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డిని కోరడంతో ధర్నా విరమించారు.

నమ్మించి అరెస్ట్ చేశారు : ఎంపీపీ సుధీర్ రెడ్డి

దొంగలు అనుకొని మఫ్టీ పోలీసులపై దాడి జరగడం విచారకరం. తండాకు చెందిన కొందరికి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేస్తామంటే సొంత పూచికత్తుతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాను.కానీ పోలీసులు నమ్మించి తండా వాసులు అరెస్ట్ చేయడం సరికాదు. తన మాట మీద స్టేషన్‌కు వచ్చిన తండా వాసులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం దారుణం.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు : సీఐ వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటయ్య

బొమ్మలరామారం : శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు వ్యవస్థ ఉందని చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని భువనగిరి రూరల్ సీఐ, కేసు విచారణ అధికారి వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మఫ్టీలో ఉన్న పోలీసులపై విచక్షణా రహితంగా దాడులు చేసిన గద్దరాళ్ల తండా వాసులను 14 మందిని గుర్తించి 8మందిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఉద్దేశపూర్వకంగా పోలీసులపై దాడులు చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని, ఈ ఘటనలో నిందితుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు.అరెస్ట్ అయిన వారిలో భూక్యా చందు, భూక్యా మహిపాల్, గూగులోతు వినోద్, భూక్యా శ్రీనివాస్, భూక్యా మహేష్, భూక్యా శ్రీను, భూక్యా మీట్యా, భూక్యా లింగం ఉన్నారని తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి, సుందరీకరణ, రహదారుల విస్తరణ, మీడియన్, డ్రెయినేజీలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డితో కలిసి సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో పర్యటించి అభివృద్ధి పనులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదే విధంగా మిర్యాలగూడ రోడ్డు, సాగర్ రోడ్డు, రాక్‌హిల్స్ కాలనీ ప్రాంతాల్లో రూ.6 కోట్లతో నిర్మించనున్న వరద కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోనే దాదాపు రూ.1,400 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వర్షాలు కురిసినప్పుడు పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వరద కాల్వల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మార్చి నెలాఖరులోగా రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులు పూర్తి చేయించి మంత్రి కేటీఆర్‌తో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి, ఈఈ రాములు, డీఈలు వెంకన్న, అశోక్‌కుమార్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు యాజమాన్యంపై కేసు



విచారణ జరుపుతున్న అధికారులు

రాజాపేట : మండల కేంద్రంలోని బద్రీనాథ్ ఫిల్లింగ్ స్టేషన్ యాజమాన్యంపై కేసు నమోదైంది. జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి సంజయ్ కృష్ణ సోమవారం పెట్రోల్ బంకును తనిఖీ చేసిన సందర్భంలో వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ తక్కువరావడం గమనించారు. నిబంధనల ప్రకారం డీజిల్ డెడ్ స్టోరేజీకి రాగానే ఆటోమేటిక్ లాక్ కాకపోవడం వల్ల వినియోగదారులు నష్టపోతున్నారని ఇండియన్ ఆయిల్ టెక్నీషియన్ కిషోర్‌కుమార్‌కు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫిబ్రవరి 4 నుంచి సదరం క్యాంపులు

–షెడ్యూల్ విడుదల చేసిన యాదాద్రి డీఆర్‌డీఏ

భువనగిరి : ఫిబ్రవరి నెలకు సంబంధించి సదరం క్యాంప్ షెడ్యూల్‌ను సోమవారం డీఆర్‌డీఏ మందడి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు.రెన్యూవల్ దరఖాస్తులతో పాటు కొత్తగా సర్టిఫికెట్‌కోసం సంబంధిత మండలాల్లోని మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మోకాళ్లు, వంటి నొప్పులు, వృద్ధాప్యంతో బాడపడుతున్నవారు, గుండె, కిడ్నీ, లివర్, క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, బ్లడ్‌క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులన్నారు. మీ సేవ కేంద్రంలో బుక్ చేసుకున్న తేదీన మాత్రమే దివ్యాంగులు భువనగిరి ఏరియా ఆస్పత్రిలో అధార్, రేషన్, ఓటర్ కార్డు, ఫొటో, డాక్టర్ రిపోర్టులు తీసుకునిరావాలన్నారు.

ఫిబ్రవరిలో క్యాంపుల తేదీలు

అర్థోపెడిక్ (శారీరక లోపం) : 4,9,16,25, కంటిలోపం : 7,14,21, మానసిక రుగ్మతగలు : 6,15,22, 28, వినికిడి లోపం : 7వ తేదీ

ఆరోగ్యం, వ్యాధులపై వర్క్‌షాప్

బీబీనగర్ : మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యం, వ్యాధులపై వర్క్‌షాప్ నిర్వహించారు, ప్రజల్లో ప్రభలుతున్న వివిధ రకాల వ్యాధులు, వాటి నివారణకు వైద్యం, సంపూర్ణ ఆరోగ్యం కోసం అనుసరించాల్సిన నియమాలు తదితర అంశాలపై వర్క్‌షాపులో విశ్లేషించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ వికాస్ భాటియా, డీన్ రాహుల్‌నారంగ్, సూపర్‌డెంట్ నీరజ్‌అగర్వాల్, రీసెర్చ్ డీన్ సంగీత, వైద్యులు నితిన్‌అశోక్ జాన్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలకు సహకారం అందించాలి

భువనగిరిటౌన్ : ప్రజా ప్రయోజనాలకు నిర్వహించే కార్యక్రమాలకు పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు తమ వంతు సహకారాన్ని అందించాలని యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో దివీస్ పరిశ్రమ వారు జిల్లాలోని 14 మండలాల్లో 484 ప్రభుత్వ పాఠశాలలకు 511 ఆర్‌ఓ వాటర్ యూనిట్స్, 38,823 స్టేయిన్ లెస్ స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేసే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొత్తం రూ.7.5కోట్ల విలువగల ఆర్‌ఓ వాటర్ యూనిట్స్, స్టెయిన్ లెస్ స్టీల్ వాటర్ బాటిల్స్‌ను ప్రభుత్వ పాఠశాలలకు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, దివీస్‌లేబరీటరీస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్, మండల విద్యా శాఖ అధికారులు కృష్ణ, శ్రీధర్, నాగవర్ధన్‌రెడ్డి, బి.కె.కె చౌదరి, వెంకటరాజు, సాయికృష్ణ పాల్గొన్నారు.

మహాత్ముడికి నివాళి

జాతి పిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, రెవెన్యూ అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డికి వ్యతిరేకంగా పోస్టర్లు

నకిరేకల్: భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వ్యతిరేకంగా నకిరేకల్ మండలం చందంపల్లి శివారులో పోస్టర్లు వెలిశాయి. జాతీయ రహదారి ఫ్లైఓవర్ వంతెన కింద 13 ప్రశ్నలతో కూడిన వాల్ పోస్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అంటించారు. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యింది. ఎంపీకి వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్‌పై చర్చ జరుగుతోంది. అనంతరం ముగ్గురు దుండగులు ఆ పోస్టర్‌ను చించి కాల్చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఎంపీకి వ్యతిరేకంగా పోస్టర్లు ఎక్కడా లేవని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.



చందంపల్లి ఫ్లైఓవర్ వద్ద పోస్టర్

ఇద్దరికి గాయాలు



గాయపడిన జానయ్య, రాములు

నకిరేకల్ : బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. నకిరేకల్‌కు చెందిన పెరక జానయ్య తన స్నేహితుడు రాములుతో కలిసి బైక్‌పై నల్లగొండకు వెళ్తున్నారు. మార్గమధ్యలో తాటికల్ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో జానయ్య, రాములు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు.

గ్రేగోల్డ్ సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

- బట్టి వద్ద పనిచేస్తుండగా బ్యాక్‌ఫైర్
- ఇద్దరు కార్మికులు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని పరిశ్రమ యాజమాన్యం వెల్లడి
- మఠంపల్లిలో విషాదఛాయలు



గ్రేగోల్డ్ పరిశ్రమ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికసంఘాలు, అఖిలపక్షాల నాయకులు



మునగపాటి సైదులు (ఫైల్)



పట్టేటి సాయి (ఫైల్)

మఠంపల్లి : సిమెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మఠంపల్లి మండల కేంద్రం సమీపంలో సోమవారం తెల్లవాజామున చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మునగపాటి సైదులు(46), పట్టేటి సాయి(23), మల్లెబోయిన సైదులు స్థానిక గ్రేగోల్డ్ సిమెంట్ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. రోజూవారీగా సోమవారం తెల్లవారుజామున విధులకు హాజరై కిల్న్ (బొగ్గు, కంకర, బూడిదను కాల్చే బట్టి) వద్ద పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బ్యాక్ ఫైర్ జరిగి ముగ్గురికి మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. తోటి కార్మికులు వారిని గమనించి హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మునగాల సైదులు మృతిచెందాడు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో పట్టేటి సాయి ప్రాణాలు కోల్పోగా మరో కార్మికుడు సైదులు తీవ్ర గాయాలతో కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు కార్మికులు చనిపోవడంతో మఠంపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కార్మిక సంఘాలు, అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

గ్రేగోల్డ్ సిమెంట్ పరిశ్రమలో మూడు మాసాల క్రితం ఇదే రీతిన జరిగిన ప్రమాదంలో కార్మికుడు రెడపంగు సైదులు మృతిచెందడం, ప్రస్తుతం జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరొకరికి తీవ్రగాయాలు కావడంతో కార్మికసంఘాలు, అఖిలపక్షనాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహాలను సందర్శించిన నాయకులు గ్రేగోల్డ్ పరిశ్రమ ప్రధాన గేటు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.50లక్షల నష్టపరిహారం, పరిశ్రమలో ఉద్యోగం కల్పించాలని, ఇప్పటికైనా పరిశ్రమలో సేఫ్టీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళన విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకుని అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరకు పరిశ్రమ యాజమాన్యం బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘు తెలిపారు. ఆందోళన కార్యక్రమంలో గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు కార్మికసంఘాలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.